ప్రజలే మీకు సమాధి కడతారు

- వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు ఎస్‌ఏ రెహమాన్
- బాబు వ్యాఖ్యలకు నిరసనగా గోపాలపట్నం బంక్ కూడలిలో మానవహారం నిర్వహణ
- అంబులెన్స్‌కు దారి వదిలి మానవత్వం చాటుకున్న నాయకులు



గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అంబులెన్స్‌కు దారిస్తున్న నాయకులు, కార్యకర్తలు

గోపాలపట్నం: 'ప్రజలే మీకు, మీ పార్టీకి సమాధి కడతారు.. అప్పుడు మీకు రెండు సెంట్ల భూమి ఇస్తాం' అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గం పరిశీలకుడు ఎస్‌ఏ రెహమాన్ అన్నారు. ఈ మేరకు గోపాలపట్నం బంక్ కూడలిలో నిరసన కార్యక్రమం, మానవహారం నిర్వహించారు. చంద్రబాబునాయుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ విశాఖ నగరానికి వచ్చి ప్రేలాపన చేయడం దారుణం అన్నారు. కరోనా సమయంలో ఈ చంద్రబాబునాయుడు ఎక్కడికి పోయారని ప్రజలే ప్రశ్నిస్తున్నారని తెలిపారు. జూమ్ మీటింగుల్లో కనిపించడమే తప్ప ప్రజలకు అండగా ఏం చేశారని ప్రశ్నించారు. విశాఖలో కొండలను అప్పనంగా అప్పగించిన నాయకుడు చంద్రబాబు నాయుడేనని విమర్శించారు. చంద్రబాబునాయుడంత అసూయపరుడు దేశంలో ఎవరూ ఉండరన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఇళ్లు ఇస్తామని డీడీలు కట్టించుకుని మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు ఇళ్లస్థలాల గురించి విమర్శించడం శోచనీయమన్నారు. ఈ మోసగాడిని జనం నమ్మడం మానేశారని తెలిపారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ సెంటు స్థలం సమాధి నిర్మించుకోవడానికే గాని ఇల్లు కట్టుకోవడానికి కాదని చంద్రబాబు అనడం దారుణమన్నారు. మీ ప్రభుత్వంలో కనీసం సెంటు స్థలం కూడా ఇవ్వలేదని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదలకు సొంతిల్లు ఇచ్చారన్నారు. ఆ విషయం పేదలే చెబుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ మాట్లాడుతూ ప్రజల్లో జగన్‌మోహన్ రెడ్డికి ఉన్న అభిమానాన్ని చూడలేక మతి భ్రమించి చంద్రబాబు మాట్లాడుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు ముర్రు వాణీ నానాజీ, కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు, వార్డు అధ్యక్షులు గులిగిందల కృష్ణ, గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, చుక్క ప్రసాదరెడ్డి, మల్లేశ్వరరావు, గుండు నాగేశ్వరరావు, పిలకా రామ్మోహన రెడ్డి, బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, శ్రీదేవి వర్మ, మళ్ల ధనలత, నమ్మి శ్రీను, ఆళ్ల పైడిరాజు అయితశెట్టి గోపీ, గేదెల మురళీకృష్ణ, కొల్లి నూకరెడ్డి, వూటపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు దారిచ్చిన ఆందోళనకారులు

మానవహారం నిర్వహిస్తున్న సమయంలో అటుగా అంబులెన్స్ రావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అంబులెన్స్‌కు దారిచ్చేందుకు సన్నద్ధమయ్యారు. సుమారు 10 కార్ల వెనుక అంబులెన్స్ ఉండడంతో ముందున్న కార్లకు దారి వదిలారు. దాంతో అంబులెన్స్ ముందుకు సాగిపోవడానికి మార్గం సుగమం కావడంతో అంబులెన్స్ గమ్యం వైపు సాగిపోయింది. అనంతరం నాయకులు, కార్యకర్తలు మళ్లీ తమ ఆందోళన కొనసాగించారు. ఇది చూసిన వారు మానవత్వం కలిగిన నాయకులంటూ కొనియాడారు.

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల సంబరం



ఎర్నిమాంబ ఘటాలతో వస్తున్న భక్తులు



రథంపై ఎర్నిమాంబ ఉత్సవ విగ్రహం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం అచ్చియ్యమ్మపేట, కాన్వెంట్ కూడలిలో గల ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ ఆలయం వద్ద ఎర్నిమాంబ అమ్మవారి ఘటాలతో బయలుదేరారు. కొబ్బరితోట, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం పుట్టబంగారం వద్దకు అమ్మవారి ఘటాలను చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. అనంతరం ఆలయం వద్ద అగ్నిగుండాలపై భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవదాయ శాఖ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన జాతర నిర్వహించనున్నారు.

సంపత్ వేంకటేశ్వరునికి సుప్రభాత సేవ



సంపత్ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ మాస శుద్ధ పాడ్యమి శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, పద్మావతి, అలవేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులు నక్కా శంకరరావు, పల్లా పెంటినాయుడు, నమ్మి భాస్కరరావు, కొయ్య జగదీష్ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తి సంకీర్తన, నక్షత్ర హారతి నిర్వహించారు.

క్లుప్తంగా

బాగుపడిన కుళాయిలు



ఖార్వేల్‌నగర్‌లో నీటి నాణ్యత పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ కుళాయిల సరఫరా అవుతున్న నీటిలో పురుగులు రావడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. బంటా కాలనీ వద్ద ఉన్న ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. పైపుల్లో ఉన్న నీటిని బయటకు పోయేలా చేసి శనివారం ఉదయం కుళాయిల్లో మంచి నీరు సరఫరా చేశారు. వాటర్ వర్క్స్ సిబ్బంది పలు ప్రాంతాల్లో కుళాయిల నాణ్యతను పరిక్షించారు. అధికారులు తీసుకున్న చర్యల్ని స్థానికులు అభినందిస్తున్నారు.

వృద్ధులకు పండ్లు, దుప్పట్ల పంపిణీ



బంగారుతల్లి వృద్ధాశ్రమంలో జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానులు

గోపాలపట్నం: జూనియర్ ఎన్‌టీఆర్ పుట్టిన రోజు వేడుకలను బుచ్చిరాజుపాలెంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీనివాసనగర్ వద్ద ఉన్న బంగారుతల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, దుప్పట్లు అందించారు. గోపాపట్నం మౌర్యా సినిమా హాలు వద్ద మజ్జిగ పొట్లాలు అందించారు. ఈ కార్యక్రమంలో మళ్ల చిన్న అప్పారావు, తిరుపతి శ్రీనివాసరావు, జనార్దన్, విజయ్, గౌరి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

మంచు మనోజ్‌కు బర్త్‌డే విషెస్



మంచు మనోజ్‌తో బాలుభార్గవ్

కంచరపాలెం: సినీ నటుడు, నిర్మాత మంచు మనోజ్ జన్మదిన వేడుకలు హైదరాబాద్ ఫిలింనగర్‌లోని ఆయన నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ బాలుభార్గవ్ మంచు మనోజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైజాగ్‌లో అభిమానులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయనకు వివరించారు.

మార్కెట్‌లో అపారిశుధ్యంపై జెడ్సీ ఆగ్రహం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం న్యూహోల్‌సేల్ మార్కెట్‌లో జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ శనివారం పర్యటించారు. మార్కెట్‌లో అపారిశుధ్యం తాండవించడంతో సిబ్బందిపై మండిపడ్డారు. పరిసరాల పరిశుభ్రతపై వర్తక సంఘం సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జోనల్ కమిషనర్ కృష్ణ పలు సూచనలు చేశారు. దుకాణదారులంతా తడిపొడి చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ జనార్దన్‌రావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, వర్తక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ ఎంపీ, మంత్రిని అరెస్టు చేయాలి'



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సీతమ్మధార/మహారాణిపేట : దేశానికి పేరు, ప్రతిష్టలు తెచ్చిన భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను, హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌ను అరెస్ట్ చేసి, పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సంఘీభావంగా శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 28 రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో మల్లయోధులు పోరాటం చేస్తున్నా అక్కడే ఉన్న బీజేపీ ప్రభుత్వానికి చలనం లేదన్నారు. రెజ్లర్లపై ఫిర్యాదును నమోదు చేయకుండా తిరస్కరించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం వెంటనే మల్లయోధుల సమస్య పరిష్కరించాలన్నారు. నిరసనకారులు, జర్నలిస్టులపై క్రూరమైన దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, సీఐటీయూ కార్యదర్శి పి.మణి, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్ రాజు, కె.సంతోష్, జోనల్ ప్రెసిడెంట్ కామేశ్వరి, ఐద్వా నాయకులు పుష్పాంజలి, కె.వేణు, వరలక్ష్మి, బి.భారతి, ఆర్.విమల, మమత, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

హార్బర్ ఆధునికీకరణకు సహకరించండి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌ను రూ. 152 కోట్లతో ఆధునీకరించేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళిక అమలుకు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను నాయకులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో హార్బర్ హైలెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పోర్టు అధికారులు, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, మత్స్యకార సంఘాల నాయకులు వాసుపల్లి జానకీరామ్, బర్రె కొండబాబు, చింతపల్లి వీరన్న, దూడ పోలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునికీకరణకు టెండర్లు పిలిచామన్నారు. కొన్ని పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు.

బాక్సింగ్ తరగతులు ప్రారంభం



క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సింథియా : షిప్‌యార్డ్ క్రీడా మైదానంలో శనివారం జగనన్న వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బాక్సింగ్ తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని బాక్సింగ్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. సీఎం జగన్‌మోహనరెడ్డి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. పిల్లలు కూడా వారికి నచ్చిన క్రీడలు ఎన్నుకుని శిక్షణ ద్వారా భవిష్యత్తులో తల్లిదండ్రులు, గురువులకు, గ్రామానికి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం చిన్నారులకు ఎగ్, బన్, అంటి పండ్లు, ఫ్రూటీలను సచివాలయ అడ్మిన్ హనోక్, వెల్ఫేర్ సెక్రటరీ రాజాబాబు ఆర్థిక సాయంతో అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ సత్తిబాబు, సచివాలయ కన్వీనర్ మీసాల సత్యనారాయణ, బాక్సింగ్ కోచ్ గుర్రాల రామారావు, సాహా ఇంటర్నేషనల్ బాక్సర్లు లీలాప్రసాద్, గణేష్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, బాక్సింగ్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర అద్వితీయం



వలంటీర్లకు దిశా నిర్దేశం చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడంలో వలంటీర్ల పాత్ర అమోఘమని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీ-1 సచివాలయంలో శనివారం సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లుతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసే సంక్షేమ రథసారథులు వలంటీర్లు అన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మీడియా ద్వారా వేసే నిందలను అడ్డుకునే విధంగా ప్రతి గడపకు వెళ్లి కోట్లాది మంది ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధిని వివరించవలసిన బాధ్యత వలంటీర్లు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో పార్టీ గెలుపే లక్ష్యంగా సచివాలయ సిబ్బంది పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది హనోక్, రాజాబాబు, సాయిల్, సత్తిబాబు, లక్ష్మీదుర్గ, కళ్యాణి, గౌసియా, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో పండ్ల రసం పంపిణీ



చలివేంద్రంలో పండ్ల రసాన్ని పంపిణీ చేస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి కాలనీ కాళింగవీధి, గాంధీబొమ్మ సెంటర్ వద్ద ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాళింగ వాలీబాల్ టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని పాదచారులకు, ప్రజలకు చల్లని పండ్ల రసం, మజ్జిగను పంపిణీ చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, వాలీబాల్ టీమ్ సభ్యులు ప్రగడ ధనుంజయ్, దుగ్గపు గిరిబాబు, ప్రగడ భరత్‌కుమార్, మార్పు ధనుంజయ్, ప్రగడ విజయ్‌కుమార్, ప్రగడ శేఖర్, బొడ్డ హేమంత్, పుల్లట పృధ్వి, బొడ్డ సాయికుమార్ పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు ప్రసాద్, లోహిత్, దిగ్విజయ్‌లు

విశాఖ స్పోర్ట్స్ : మెన్ యూత్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ బాంటమ్ వెయిట్ ఫైనల్ బౌట్‌లో అనంతపురానికి చెందిన వి.పవన్‌తో స్థానిక బాక్సర్ పి.ప్రసాద్ తలపడనున్నాడు. మినిమం వెయిట్‌లో ఎస్.తేజశ్వర్‌తో పి.వాసుదేవ పాత్రుడు ఫైనల్‌లో తలపడనున్నాడు. ఫ్లైవెయిట్ 48-51కేజీల్లో స్థానిక బాక్సర్ కె.లోహిత్‌తో చిత్తూరుకు చెందిన ఎం.మున్నా తలపడనున్నాడు. విశాఖలోని రైల్వే బాక్సింగ్ హాల్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా శనివారం పలు వెయిట్ కేటగిరిల్లో మెన్ సెమీస్ పోటీలు జరిగాయి. ఆదివారం జరిగే ఫైనల్‌లో ఫెదర్‌వెయిట్ 54-57కేజీల్లో స్థానిక బాక్సర్ బాలగణేష్‌తో శ్రీకాకుళానికి చెందిన వి.మధు తలపడనున్నాడు. లైట్‌వెయిట్ 57-60కేజీల్లో పి.దిగ్విజయ్‌తో నెల్లూరుకు చెందిన జె.వాసు తలపడనుండగా లైట్‌వెల్టర్ 60-63.5 కేజీల వెయిట్‌లో ఆశిఫ్‌తో జె.భానుప్రకాష్, వెల్టర్ 63.5-67కేజీల వెయిట్‌లో ఎస్.దిలీప్‌కుమార్‌తో ఎన్.హర్షవర్ధన్ పోటీపడనున్నాడు. లైట్‌మిడిల్ 67-71కేజీల వెయిట్‌లో బి.తృణతో వై.ప్రభువర్ధన్, మిడిల్ 71-75కేజీల వెయిట్‌లో ఎస్.మోహన్‌రావుతో ఎ.అశోక్‌కుమార్ తలపడనున్నాడు. లైట్ హెవీ వెయిట్‌లో కె.దుర్గాప్రసాద్‌తో ఆయూష్ పూర్తి, క్రూజియర్ వెయిట్‌లో కె.రామ్‌తో పి.దేవ్‌కుమార్ తలపడనున్నారు. ఆదివారం మెన్ ఫైనల్స్‌తో పాటు టోర్నీలో భాగంగా వుమెన్ బౌట్స్ నిర్వహించనున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచన ఉపసంహరించుకోవాలి



కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలనే యోచనను కేంద్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం డిమాండ్ చేశారు. ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్షకు ఇంటక్ నాయకులు సంఘీభావం తెలిపారు.స్థానిక గాంధీ విగ్రహం వద్ద శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారులకు అప్పగించేందుకే ప్రభుత్వరంగ సంస్థలను మూసివేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఇంటక్ నాయకులు నర్సింగ్‌యాదవ్, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

ఆదమరిస్తే అంతే

- పగిలిని కాలువ పైకప్పు దిమ్మ



పిలకవానిపాలెం సేవా మార్గంలో కాలువపై సిమెంట్ దిమ్మ విరగటంతో రాళ్ళు అడ్డుగా పెట్టిన దృశ్యం

మల్కాపురం: 58వ వార్డు పిలకవానిపాలెం సేవా మార్గంలో గల కాలువపై గల సిమెంట్ దిమ్మ విరిగిపోయింది.దీంతో అక్కడ రంధ్రం ఏర్పడింది.ఆ మార్గాన వచ్చే వాహనదారులు,పాదచారులు ప్రమాదానికి గురికాకుండా పగిలిన సిమెంట్ దిమ్మపై రాళ్లను అడ్డంగా పెట్టారు. ఆదమరిచి ప్రయాణిస్తే గాయాలుపాలుకాక తప్పదు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలి.

బుజ్జి, పిలకవానిపాలెం

చెత్తతో చిక్కులెన్నో..

- వీధుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- దుర్గంధంతో ప్రజలకు ఇబ్బందులు



40వ వార్డులో చెత్తా చెదారంతో నిండిపోయిన డ్రైనేజీ



62వ వార్డు పరిధి మల్కాపురం మార్కెట్‌లోని కాలువల దుస్థితి



ప్రకాష్‌నగర్‌లో పోర్టు మైదానం వద్ద చెత్తచెదారంతో నిండిన ఖాళీ స్థలం

సింథియా: నగర పాలక సంస్థ అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 40, 62, 63 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మల్కాపురం మార్కెట్‌లోనూ పారిశుధ్యం లోపించి వీధులన్నీ చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. దోమలు వ్యాప్తి చెంది ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా పందులు, కుక్కల సంచారం అధికమవుతోంది. స్థానికులు తిరగలేని విధంగా వీధులు తయారవుతున్నాయి. తీవ్ర దుర్గంధం వస్తుండడంతో భరించలేకపోతున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ముందే ఇరుకు రోడ్లు ఆపై వ్యర్థాలతో నిండిపోవడంతో వాహనాలు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. లక్షల రూపాయలతో నిర్మించిన డ్రైనేజీలు సైతం నిర్వహణ లేక అధ్వానంగా ఉన్నాయి. చెత్తతో పాటు ఇటీవల భవన నిర్మాణ వ్యర్థాలను సైతం ప్రధాన రహదారులకు ఇరువైపులా డంపింగ్ చేయడంతో అసలు ఇవీ రోడ్లా, లేక డంపింగ్ యార్డులా అనే సందేహం కలుగుతోంది. ఈ చెత్తలోనే ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ సంచులు కూడా ఉండడం, ఆవులు తదితర జంతువులు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాణించిన యశ్వంత్, చంటి

విశాఖ స్పోర్ట్స్ : వీడీసీఏ డివిజన్ లీగ్‌లో భాగంగా మూడో డివిజన్‌లో జరిగిన పోటీల్లో యశ్వంత్, చంటి రాణించి జట్టుకు విజయాన్నందించారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో సోలో సీసీతో తలపడిన సిటీసీసీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 264 పరుగులకు ఆలౌటైంది. యశ్వంత్ (107)సెంచరీ నమోదు చేయగా వరుణ్ 77 పరుగులు చేశాడు. ప్రతిగా సోలోసీసీ 185 పరుగులకే ఆలౌటైంది. చంటి 44 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు.

కారును ఢీకొట్టిన ట్రాక్టర్



ప్రమాదంలో డివైడర్ పైకి ఎక్కిన కారు

మల్కాపురం : మల్కాపురంలోని త్రినాథపురం ప్రాంతానికి చెందిన అప్పారావు అనే వ్యక్తి శనివారం రాత్రి 8 గంటల సమయంలో నగరం నుండి నేవల్ డాక్‌యార్డ్ మీదుగా సింధియా వైపు వస్తున్నాడు. ఏపీ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మలుపు వద్ద ట్రాక్టర్‌కు ముందున్న ఓ నేవల్ ఉద్యోగి కారును ఢీకొట్టాడు. దీంతో ఆ కారు డివైడర్ పైకి దూసుకుపోయింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌తో పాటు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి విచారించారు. కారును ఢీకొట్టిన వ్యక్తి త్రినాథపురానికి చెందిన వాడిగా గుర్తించారు. కేసును ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

మద్దిలపాలెం: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం ద్వారా పీఠాపురం కాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామనిడైరెక్టర్ సి.హెచ్.అప్పలనాయుడు తెలిపారు. నైపుణ్యం, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ద్వారా మహిళల స్వయం ఉపాధి పొందే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే ముస్లిం తాటిచెట్లపాలెం, మల్కాపురం, అనకాపల్లి కేంద్రాలుగా శిక్షణ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 15 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు శిక్షణ పొందడానికి అర్హులని తెలిపారు. నైపుణ్యం గల యువతరాన్ని తయారు చేయాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు.

నేడు బీచ్‌క్లీన్ కార్యక్రమం

మహారాణిపేట : ఆదివారం ఉదయం 6 గంటల నుండి బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. జన్ భాగీరథి ప్రోగ్రామ్‌లో భాగంగా భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రమైన బీచ్‌లు, కాలుష్యరహిత మహా సముద్రాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రామకృష్ణ బీచ్ నుంచి వైఎంసీఏ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ మల్లికార్జున కోరారు.